# 12 ఏండ్లలో అత్యల్పం

**మరింత దిగజారిన కోహ్లీ ర్యాంకు • రోహిత్ పరిస్థితి అధ్వాన్నం**



దుబాయ్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో పేలవ ఫామ్‌తో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న భారత దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తాజాగా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో మరింత దిగజారారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్ జాబితాలో కోహ్లీ.. మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంక్‌కు పడిపోగా రోహిత్‌శర్మ 42వ స్థానంలో ఉన్నాడు. గడిచిన 12 ఏండ్ల కాలంలో టాప్-25లో లేకపోవడం కోహ్లీకి ఇదే తొలిసారి. 2012 డిసెంబర్‌లో కోహ్లీ చివరి సారిగా 36వ ర్యాంకులో ఉన్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో పెర్త్ టెస్టు సెంచరీ మినహా మిగిలిన 8 ఇన్నింగ్స్‌లో కోహ్లీ చేసింది 90 పరుగులే. ఆఫ్‌స్టంప్ అవతల వెళ్తున్న బంతులను వేటాడి బలైన కోహ్లీ.. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్‌కు నాలుగు సార్లు ఇదే రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఇక గతేడాది స్వదేశంలో బంగ్లాదేశ్ సిరీస్‌కు ముందు ఆరో స్థానంలో ఉన్న రోహిత్ ర్యాంకు క్రమంగా దిగువకు పడిపోయింది. న్యూజిలాండ్‌తో 3 మ్యాచ్‌ల సిరీస్ తర్వాత 26కు పడిపోయిన హిట్‌మ్యాన్ ర్యాంకు.. తాజాగా 42వ ర్యాంక్ వద్ద నిలిచింది. ఈ జాబితాలో టాప్-10లో నిలిచిన బ్యాటర్లలో భారత్ నుంచి యశస్వీ జైస్వాల్ (4), రిషభ్ పంత్ (9) ఉన్నారు.

# ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

**• మలేషియా ఓపెన్**



కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీని భారత డబుల్స్ స్టార్ ద్వయం సాత్విక్-చిరాగ్ విజయంతో ప్రారంభించింది. పురుషుల డబుల్స్‌లో ఈ జోడీ 21-10, 16-21, 21-5తో కై వై-లు మింగ్(మలేషియా)ను ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరింది. సింగిల్స్ విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, మాళవిక బన్సోద్ ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 21-12, 17-21, 21-15తో బ్రియాన్ యాంగ్ (కెనడా)ను ఓడించాడు. మరో మ్యాచ్‌లో ప్రియాన్షు రజావత్ 11-21, 16-21తో షిఫెంగ్ లి (చైనా) చేతిలో చిత్తయ్యాడు. మహిళల సింగిల్స్‌లో బన్సోద్ 21-15, 21-16తో జిన్ వీ(మలేషియా)ను ఓడించింది. కానీ ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ ఓటమి పాలయ్యారు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప సైతం తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.

# రెండో వన్డేలోనూ కివీస్ గెలుపు



హామిల్టన్ : స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది. వర్షం అంతరాయం వల్ల 37 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో కివీస్.. 113 పరుగుల తేడా(డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో)తో లంకను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 37 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (79), చాప్‌మన్ (62) రాణించారు. లంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ (4/44) వన్డేలలో తొలి హ్యాట్రిక్ నమోదు చేశాడు. అనంతరం ఛేదనలో లంకేయులు 30.2 ఓవర్లలో 142 పరుగులకే చేతులెత్తేశారు. కమిందు మెండిస్ (64) మినహా మిగిలిన వారంతా విఫలమయ్యారు. ఇది వరకే సిరీస్‌ను దక్కించుకున్న కివీస్.. ఈనెల 11న ఆక్లాండ్ వేదికగా మూడో వన్డే ఆడనుంది.

# చాంపియన్స్ ట్రోఫీకి కూర్పు కుదిరేనా?

**మరో 35 రోజుల్లో మెగా టోర్నీ • రోహిత్, కోహ్లీకి ఆఖరి చాన్స్!**

**షమీ ఫిట్‌నెస్‌పై వీడని సందిగ్ధత • రాహుల్, పంత్ మధ్య పోరులో సెలెక్టర్ల మొగ్గు ఎటువైపు?**





ఢిల్లీ: తీవ్ర వేదనను మిగిల్చిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న భారత క్రికెట్ జట్టు ఎదుట మరో కఠిన సవాల్! వచ్చే నెల పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం ఈనెల 12 లోపు ప్రాథమిక జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతకంటే ముందే స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి నేడో రేపో సెలెక్టర్లు జట్టును ప్రకటించే అవకాశముంది. ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడిన జట్టునే చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడించే చాన్స్ ఉంది. అయితే ఈ టోర్నీలో ఎవరిని ఆడించాలి? పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతున్న సారథి రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని కొనసాగించాలా.. వద్దా? వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ పూర్తి ఫిట్‌నెస్ అందుకున్నాడా? కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో వికెట్ కీపర్‌గా ఎవరికి అవకాశం దక్కనుంది? సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తుది జట్టులో ఉంటాడా? వంటి ప్రశ్నలతో సెలెక్టర్లకు కొత్త తలనొప్పులు ఎదురుకాబోతున్నాయి.

**'రోకో'.. ఆఖరి మోక**

రెండేండ్ల క్రితం భారత్‌లో ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో అదిరిపోయే ఫామ్‌తో ఆకట్టుకుని, గతేడాది టీ20 ప్రపంచకప్‌లోనూ రాణించిన భారత స్టార్ బ్యాటర్లు రోహిత్, కోహ్లీ ఆ తర్వాత దారుణంగా విఫలమవుతున్నారు. ఇటీవల ముగిసిన ఆసీస్ సిరీస్ వారి వైఫల్యానికి పరాకాష్ట. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతూ సిడ్నీ టెస్టులో తనంత తానుగా తుది జట్టు నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి రోహిత్‌కు వచ్చింది. ఇందుకు కోహ్లీ కూడా మినహాయింపు కాదు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తినా బీసీసీఐ మాత్రం ఈ ఇద్దరికీ ఆఖరి అవకాశం ఇచ్చేందుకు మొగ్గుచూపినట్లు సమాచారం. వన్డే ఫార్మాట్‌లో ఈ ద్వయానికి ఉన్న రికార్డులు, అనుభవం దృష్ట్యా 'రోకో'పై చర్యలేమీ ఉండబోవని, ఈ ఇద్దరూ చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. రోహితే జట్టును నడిపిస్తాడు. ఇటీవల నిలకడగా రాణిస్తున్న జైస్వాల్‌ను రోహిత్‌కు ఓపెనర్‌గా బరిలోకి దించే యోచనలో జట్టు మేనేజ్‌మెంట్ ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి.

**సీనియర్లలో వేటు ఎవరిపై?**

సీనియర్ ఆటగాళ్లైన రాహుల్, షమీ, జడేజా, రిషభ్, అక్షర్‌లో ఎవరిని తుది జట్టులో ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. వన్డే వరల్డ్ కప్‌లో రాహుల్, షమీ అంచనాలకు మించి రాణించారు. కానీ ఆ తర్వాత భారత్ ఆడిన ఆరు వన్డేలకూ షమీ దూరమయ్యాడు. ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో అయినా ఆడతాడనుకుంటే మోకాలి వాపు తిరగబెట్టడంతో అతడు మళ్లీ ఎన్‌సీఏకు వెళ్లాడు. అయితే ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న అతడి ఫిట్‌నెస్‌ను దగ్గర్నుంచి సమీక్షిస్తున్న బీసీసీఐ మెడికల్ టీమ్.. షమీకి క్లీన్‌చిట్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో షమీని ఆడించనున్నట్టు వినికిడి. ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అంచనాలను అందుకోలేకపోయినా రాహుల్ మరీ చెత్త ప్రదర్శనలైతే నమోదు చేయలేదు. అయితే వికెట్ కీపర్ కోటాలో రాహుల్‌కు పంత్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. మరోవైపు పంత్ కూడా గొప్పగా రాణించింది లేదు. బ్యాటర్ కోటాలో అయితే రాహుల్‌కు అవకాశం లేకపోయినప్పటికీ వికెట్ కీపర్ కోటాలో మాత్రం అతడు పోటీలో ఉన్నాడు. ఈ ఇద్దరిలో సెలెక్టర్ల మొగ్గు ఎవరి వైపు అన్నది త్వరలో తేలనుంది. ఇక సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ జడేజా బ్యాటింగ్ వన్డేలలో అంత గొప్పగా ఏం లేదు. అతడి స్థానంలో అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కుల్దీప్ యాదవ్ ఫిట్‌గా లేకుంటే వాషింగ్టన్ సుందర్‌కు తలుపులు తెరుచుకున్నట్టే.

**నితీశ్‌కు చాన్స్!**

ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్‌రెడ్డి వైపు సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్యాకు జతగా అతడిని తీసుకుంటే బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ బలోపేతమవుతుంది.

# బాక్సింగ్‌లో కొత్త బరువు విభాగాలు

బరేలీ: ప్రపంచ బాక్సింగ్ కొత్త తీసుకొచ్చిన బరువు విభాగాలను భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్‌ఐ) అమలు చేయబోతున్నది. జాతీయ పురుషుల టోర్నీ ద్వారా కొత్త కేటగిరీలతో పోటీలను నిర్వహిస్తున్నది. గతంలో ఉన్న 13 విభాగాలను వరల్డ్ బాక్సింగ్ పదింటికి కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో కొత్త బరువు విభాగాలు 50కి(ఫ్లై వెయిట్), 55కి(బాటమ్‌వెయిట్), 60కి(లైట్‌వెయిట్), 65కి(వెల్టర్‌వెయిట్), 70కి(లైట్ మిడిల్‌వెయిట్), 75కి(మిడిల్‌వెయిట్), 80కి(లైట్ హెవీవెయిట్), 85కి(క్రూజర్‌వెయిట్), 90కి(హెవీ వెయిట్), 90+కి(సూపర్ హెవీవెయిట్)గా ఉన్నాయి. వీటిలో ఆరు 55కి, 60కి, 65కి, 70కి, 80కి, 90కిలను ఒలింపిక్ కేటగిరీలుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ) గుర్తింపు కోల్పోయిన తర్వాత గత ఏప్రిల్‌లో వరల్డ్ బాక్సింగ్ కొత్తగా మొదలైంది. ఇప్పటికే 60 మంది సభ్యుల మద్దతు కూడగట్టిన వరల్డ్ బాక్సింగ్..ఐవోసీ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నది.

# ముక్కోణపు సిరీస్ వేదికల మార్పు

**స్టేడియాల పునరుద్ధరణ పనులపై పుకార్లకు పీసీబీ చెక్**

కరాచీ: త్వరలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో జరుగబోయే ముక్కోణపు సిరీస్‌కు ఆతిథ్యమివ్వనున్న పాకిస్థాన్.. మ్యాచ్‌లు జరుగబోయే వేదికలను మార్చింది. షెడ్యూల్ ప్రకారం ముల్తాన్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నప్పటికీ చాంపియన్స్ ట్రోఫీ జరిగే గడాఫీ స్టేడియం (లాహోర్), నేషనల్ బ్యాంక్ స్టేడియం (కరాచీ)కు మార్చింది. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఈ స్టేడియాలలో పునరుద్ధరణ పనులు జరుగుతుండగా అవి నత్తనడకన సాగుతున్నాయని.. నిర్ణీత సమయం వరకు పూర్తయ్యే అవకాశం లేదని కొద్దిరోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తాజా నిర్ణయంతో వాటికి చెక్ పెట్టినట్టైంది. ఫిబ్రవరి 19 నుంచి మొదలుకాబోయే చాంపియన్స్ ట్రోఫీకి ముందు జరుగబోయే ఈ సిరీస్ వచ్చే నెల 8న ప్రారంభమై 14తో ముగియనుంది.

## బాంబ్రీ క్వార్టర్స్‌కు.. బాలాజీ ఇంటికి



ఢిల్లీ: న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఏటీపీ టూర్స్ (టెన్నిస్)లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. ఆక్లాండ్ (న్యూజిలాండ్) వేదికగా జరుగుతున్న ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో యుకీ బాంబ్రీ-అల్బనో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం.. 6-4, 6-4తో సాండర్ అరెండ్స్-లూక్ జాన్సన్ (పారిస్)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. ఇక అడిలైడ్ (ఆస్ట్రేలియా) ఇంటర్నేషనల్ టోర్నీ ప్రీక్వార్టర్స్‌లో బాలాజీ-రెయిస్ జోడీ.. 6-3, 3-6, 11-13తో హెలివారా-హెన్రీ (మెక్సికో) చేతిలో ఓటమిపాలైంది.

## క్రికెట్‌కు గప్టిల్ వీడ్కోలు



ఆక్లాండ్: న్యూజిలాండ్ వెటరన్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2009లో జాతీయ జట్టులోకి వచ్చిన గప్టిల్.. బుధవారం 14 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. చివరిసారిగా కివీస్ తరపున 2022లో ఆడిన అతడు.. మూడు ఫార్మాట్లలో కలిపి 367 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించాడు. న్యూజిలాండ్ తరపున వన్డేలలో ద్విశతకం చేసిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కిన ఈ విధ్వంసక ఓపెనర్.. 198 వన్డేలు, 122 టీ20లు, 47 టెస్టులు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి గప్టిల్ ఖాతాలో 23 శతకాలున్నాయి. వన్డేలలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్లలో న్యూజిలాండ్ నుంచి రాస్ టేలర్, స్టీఫెన్ ఫ్లెమింగ్ తర్వాత గప్టిల్ మూడోస్థానం (7,346)లో ఉన్నాడు. టీ20లలో 3,533 పరుగులతో కివీస్ నుంచి మొదటి స్థానంలో నిలిచాడు.

చిత్రం

# 'హైందవ' రక్షణ కోసం



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హైందవ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేష్ చందు నిర్మిస్తున్నారు. బుధవారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పవిత్రమైన దశావతార ఆలయాన్ని నాశనం చేయడానికి కొందరు దుండగులు చేసే ప్రయత్నాన్ని హీరో భగ్నం చేయడం, ఈ క్రమంలో ఎదురయ్యే ఆశ్చర్యకరమైన ఘటనలతో గ్లింప్స్ ఉత్కంఠను పంచింది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ శక్తివంతమైన పాత్రలో కనిపించారు. దేవుడి విగ్రహాలను, దేవాలయాలను తమ స్వార్థం కోసం వాడుకునే దుష్టశక్తులను దైవం ఏ రూపంలో శిక్షిస్తుంది? ఎవరి ద్వారా ధర్మరక్షణకు సంకల్పిస్తుందనే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సినిమాకు పాన్ ఇండియా స్థాయిలో మంచి టైటిల్ కుదిరిందని, ఇప్పటికే 30 శాతం చిత్రీకరణ పూర్తయిందని, ఆధ్యాత్మికత, యాక్షన్ అంశాల కలబోతగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణ సంస్థ: మూన్‌షైన్ పిక్చర్స్, రచన-దర్శకత్వం: మహేష్ చందు.

# నిజమైన సంతోషానికి అర్థం



'తల్లిదండ్రుల పెళ్లి చూసే అవకాశం బిడ్డలకు ఉండదు. కానీ పిల్లలు చూడగలిగిన పెళ్లి ఏదైనా ఉందంటే అది షష్టిపూర్తి ఒక్కటే. ప్రతి మనిషికి షష్టిపూర్తి చాలా ముఖ్యం' అన్నారు సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్. ఆయన ప్రధాన పాత్రలో అర్చనతో కలిసి నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేష్, ఆకాంక్షసింగ్ జంటగా నటించారు. పవన్‌ప్రభ దర్శకుడు. రూపేష్ చౌదరి నిర్మాత. బుధవారం చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరించే గొప్ప కథ ఇది. మన ఇంటిలో ఏం ఉంటే సంతోషంగా ఉంటామనే అంశాలను ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. అందరూ కుటుంబ సమేతంగా చూసి ఆనందించే సినిమా' అన్నారు. చాలా కాలం విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడం ఆనందంగా ఉందని, ఇళయరాజా, తోట తరణి వంటి లెజెండ్స్ పనిచేయడం ఈ సినిమా స్థాయి ఏమిటో చెబుతుందని అర్చన అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి విలువలతో ఈ సినిమాను తెరకెక్కించాం. ఇళయరాజాగారికి నేను పెద్ద అభిమానిని. ఆయనతో కలిసి పనిచేయడంతో నిజంగా నా జన్మ ధన్యమైంది' అన్నారు. చక్కటి కుటుంబ కథతో హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉందని రూపేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.


# నా బలమేమిటో తెలుసు!



'సినిమా ముఖ్యోద్దేశ్యం నటించి మెప్పించడం. తెరపై అందంగా కనిపించడం కాదు. అందుకే నేను గ్లామర్ కంటే అభినయప్రధాన పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తా. తక్కువ సినిమాలు చేసినా సరే నాణ్యమైన కథల్ని ఎంచుకోవాలన్నదే నా అభిమతం' అని చెప్పింది కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించింది. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం శ్రద్ధా శ్రీనాథ్ పాత్రికేయులతో సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను నందిని అనే పాత్రలో కనిపిస్తానని, సున్నితమైన వ్యక్తిత్వం కలిగిన మహిళగా లోతైన భావోద్వేగాలతో తన క్యారెక్టర్‌ను తీర్చిదిద్దారని చెప్పింది. 'ఇప్పటి వరకు నేను విభిన్నమైన కథల్లో నటించా. అయితే 'డాకు మహారాజ్' పాత్రం ఓ పూర్తి ప్యాకేజీలా ఉంటుంది. కామెడీ, యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో కుదిరాయి. ఈ సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెప్పాను. సినిమా కథల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటా. నటిగా నా బలం ఏమిటో బాగా తెలుసు. తెరపై అందాలొలికించే గ్లామర్ పాత్రల్లో కనిపించడం నాకు ఇష్టం ఉండదు. నటన ద్వారానే ప్రేక్షకులకు గుర్తుండిపోవాలన్నది నా లక్ష్యం' అని చెప్పింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తనకు 'జెర్సీ'వంటి మరపురాని విజయాన్ని అందించిందని, ఈ సినిమాలోని తన పాత్ర కూడా అదే స్థాయిలో ప్రేక్షకులకు చేరువవుతుందనే నమ్మకం ఉందని శ్రద్ధా శ్రీనాథ్ ధీమా వ్యక్తం చేసింది.

# ఇప్పుడు గుర్తిస్తున్నారు

'సినిమాల్లో నటించే అవకాశం అందరికీ రాదు. అదొక గొప్ప అదృష్టం. ఉత్తమమైన కథల్ని ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రల్ని పోషించాలనుకుంటున్నా. ఏ పాత్ర చేసినా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నదే నా లక్ష్యం' అని చెప్పింది ఐశ్వర్య రాజేష్. ఆమె వెంకటేష్ సరసన కథానాయికగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం ఐశ్వర్య రాజేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమా నరేషన్ టైంలో నవ్వాపుకోలేపోయా. అంత గొప్పగా కామెడీ పండింది. ఈ సినిమాలో నేను భాగ్యం అనే ఇల్లాలి పాత్రలో కనిపిస్తా. భిన్న భావోద్వేగాలతో సాగే పాత్ర ఇది. ఏ కొంచెం బ్యాలెన్స్ తప్పినా పాత్ర ఔచిత్యం దెబ్బతింటుంది. అందుకే చాలా సెటిల్డ్ పర్ఫార్మెన్స్ కనబరిచేందుకు ప్రయత్నించా' అని చెప్పింది. వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉందని, 'భాగ్యం క్యారెక్టర్‌లో అదరగొడుతున్నావ్' అంటూ ఆయన ఎప్పుడూ ప్రోత్సహించేవారని ఐశ్వర్య రాజేష్ పేర్కొంది. సినిమాలోని 'గోదారి గట్టు..' పాట బాగా పాపులర్ అయిందని, గతంలో ఎయిర్‌పోర్ట్‌కి వెళితే తనను అంతగా గుర్తుపట్టేవారు కాదని, ఇప్పుడు మాత్రం కనిపిస్తే చాలు చుట్టూ చేరి ఫొటోలు తీసుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేసింది. భాగ్యం వంటి పాత్ర గత ఐదారేళ్లుగా తెలుగు సినిమాలో రాలేదని, క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'సంక్రాంతికి వస్తున్నాం' అందరినీ ఆకట్టుకుంటుందని ఐశ్వర్య రాజేష్ చెప్పింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.